మళ్లీ గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో నాటుసారా తయారీ
- బైక్‌ల ద్వారా అమ్మకాలు
- కేసులు నమోదవుతున్నా మారని కొందరు

చెన్నూర్‌రూరల్‌: పల్లెల్లో ఒకప్పుడు గుడుంబా తయారీ విచ్చలవిడిగా ఉండేది. కానీ గత ప్రభుత్వం నల్లబెల్లం పూర్తిగా బ్యాన్‌చేసి ముమ్మర దాడులు నిర్వహించి, గుడుంబా తయారీదారులకు స్వయం జీవనోపాధి కల్పించింది. కానీ మళ్లీ గుడుంబా తయారీ కేంద్రాలు మొదలయ్యాయి. నల్లబెల్లం లేకపోయిన తెల్లబెల్లం, చక్కెరతో నాటుసారా తయారీ చేస్తున్నట్లు సమాచారం. మండలంలోని లంబాడిపల్లి, పొక్కూరు, కన్నెపల్లి అటవీ ప్రాంతాలతోపాటు జైపూర్‌ మండలం భీమారం, కోటపల్లి మండలాల్లో గుడుంబాను తయారీ చేసి బైక్‌ల ద్వారా సరఫరా చేస్తున్నారు. గుడుంబా తాగడంతో ఆరోగ్యం క్షీణించడమే కాకుండా మనిషి ఆర్థికంగా దెబ్బతింటుంది. అంతే కాకుండా తక్కువ ధరకే గుడుంబా లభించడంతో ఎక్కువగా గుడుంబాను తాగుతున్నారు.

ఇప్పటికి నమోదైన కేసులు

లంబాడిపల్లి, పొక్కూరు గ్రామాల్లో గత పది నెలలుగా ఎక్సైజ్‌ శాఖ అధికారులు దాడులు చేశారు. లంబడిపల్లిలో మొత్తం 25 నాటుసారా కేసులు నమోదు చేసి 22మంది నేరస్తులను బైండోవర్‌ చేయగా ఇద్దరు బైండోవర్‌ ఉల్లంఘించడంతో ఒకరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. 138 లీటర్ల నాటుసారా, 2300ల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 500ల కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని, 8 బైక్‌లను సీజ్‌ చేశారు. పొక్కూరులో 15 నాటుసారా కేసులు నమోదు చేయగా 13మందిని బైండోవర్‌ చేయగా నలుగురు బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా విధించారు. మొత్తం 42 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 1200ల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 90 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఒక ఆటో సీజ్‌ చేశారు. పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా కొందరు మాత్రం నాటుసారా తయారు చేస్తూనే ఉన్నారు.



లంబాడిపల్లి సమీపంలో నాటుసారా తయారీ స్థావరం (ఫైల్‌)

కఠిన చర్యలు తీసుకుంటాం



నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేపడుతున్నాం. విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటాం. పీడీ యాక్టు నమోదు చేస్తాం.
– ఎం.హరి, ఎక్సైజ్‌ సీఐ, చెన్నూర్‌

మేడే పోస్టర్‌ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్‌: జిల్లాకేంద్రంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఆదివారం మేడే వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు. మంచిర్యాల మున్సిపల్‌ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు ఆశయ్య, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బూడిద శ్యాంకుమార్‌, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు తిరుపతి, బూడిత తిరుపతి, చిప్పకుర్తి లింగయ్య, ఆవునూరి సుధాకర్‌, జేడీ. తిరుపతి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌: శ్రీరాంపూర్‌లోని శాంతి మైదానంలో ఆదివారం మేడే పోస్టర్‌ను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్‌ బ్రాంచి కార్యదర్శి షేక్‌ బాజీసైదా మాట్లాడుతూ సింగరేణిలో 139వ మే డే వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సింగరేణిలో కార్మికుల హక్కులే ధ్యేయంగా ఏఐటీయూసీ కృషి చేస్తుందన్నారు. యూనియన్‌ నాయకులు నవీన్‌ రెడ్డి, అగ్గు శ్రీకాంత్‌, నరసయ్య, శ్రీనివాస్‌, రమేశ్‌, రాకేశ్‌ పాల్గొన్నారు.



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

డ్రగ్స్‌పై పోరుకు సహకారం అవసరం

తాండూర్‌: డ్రగ్స్‌పై పోరుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ అన్నారు. తాండూర్‌ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌ నిర్మూలన లక్ష్యంగా యువతకు అవగాహన కల్పించడం కోసం నిర్వహించిన బెల్లంపల్లి సబ్‌ డివిజన్‌ స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో వేమనపల్లి జట్టు ప్రథమ శ్రేణిలో నెగ్గగా, తాండూర్‌ బీ జట్టు ద్వితీయ, తాండూర్‌ ఏ జట్టు తృతీయ, మందమర్రి జట్టు నాల్గో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన క్రీడాజట్లకు ఎమ్మెల్యే వినోద్‌, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ్‌భాస్కర్‌ రెడ్డి, ఏసీపీ రవికుమార్‌ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, అధికారులు మాట్లాడుతూ యువకులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఉగ్రదాడిలో మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కాంగ్రెస్‌ సేవాదళ్‌ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో..

మంచిర్యాలఅర్బన్‌/కోటపల్లి/పాతమంచిర్యాల/దండేపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి ఆత్మకు శాంతి చేకూరాలని పలుచోట్ల కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మంచిర్యాల సీఎస్‌ఐ వెస్లీ చర్చి ప్రధాన ద్వారం నుంచి ప్రార్థన మందిరం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కోటపల్లిలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి మహేశ్‌ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ తీశారు. పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా దండేపల్లి మండలం మేదరిపేటలో ఐక్యవ్యాపార, వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బంద్‌ పాటించారు. తమ వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసి ఉంచారు. అంతకు ముందు ఉదయం 6 గంటలకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి స్థానిక బస్టాప్‌ వద్ద మృతులకు నివాళులర్పించారు. కాంగ్రెస్‌ సేవాదళ్‌ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్‌ సేవాదళ్‌ రాష్ట్ర కార్యదర్శి నీలకంఠేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షులు హఫీజ్‌, ఉపాధ్యక్షులు కోవ జంగు, మహిళా అధ్యక్షురాలు వనజ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిక విధానాలతోపాటు, కార్మికచట్టాల సవరణ విరమించుకోవాలని మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. జిల్లాకేంద్రంలోని మార్క్స్‌ భవన్‌లో ఆదివారం సదస్సు నిర్వహించారు. సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగాల కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగాల పరిశ్రమలు ప్రభుత్వాల ఆధీనంలోనే ఉండాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల్లో విదేశీ పెట్టుబడుల ఆహ్వానాలు విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్‌, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి మణిరాం, ఏఐఎఫ్‌టీయూ, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదరర్శులు పోచమల్లు, మూర్తి పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న జాతీయ కార్మిక సంఘాల నేతలు

ఆపరేషన్‌ కగార్‌ నిలిపివేయాలి

పాతమంచిర్యాల:ఆదివాసీ జాతిని హననం చేస్తున్న ఆపరేషన్‌ కగార్‌ను ఆపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. జిల్లాకేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు ఆపరేషన్‌ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌ జిల్లా కార్యదర్శి టి.జైపాల్‌సింగ్‌ మాట్లాడుతూ, చత్తీస్‌గఢ్‌, తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్ట ప్రాంతం నాలుగైదు రోజులుగా యుద్ధక్షేత్రాన్ని తలపిస్తోందన్నారు. గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారన్నారు. కర్రెగుట్ట ప్రాంతం నుంచి సాయుధ బలగాలను ఉపసంహరించాలని డిమాండ్‌ చేశారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి నరమేధానికి స్వస్తి పలకాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

తాండూర్‌: గిరిజనులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ అన్నారు. మంచిర్యాలకు చెందిన ఓ ప్రైవేట్‌ వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలో నరాసేపూర్‌లో గిరిజనుల కోసం ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎంతో సదుద్దేశ్యంతో పోలీసులు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు సంప్రదాయ వాయిద్యాలు, దండారీ నృత్యాలతో గిరిజనులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన సీఐ కుమారస్వామి, ఎస్సై సౌజన్యను ఏసీపీ రవి కుమార్‌ అభినందించారు. కార్యక్రమం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యంతో వండిన భోజనాన్నీ ఆదివాసి మహిళలతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ మహేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బానయ్య, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, నాయకులు పేరం శ్రీనివాస్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్గొన్న చాణక్య స్కూల్‌ పూర్వ విద్యార్థులు

శ్రీరాంపూర్‌/మందమర్రిరూరల్‌: నస్పూర్‌లోని చాణక్య హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్‌ పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆదివారం నస్పూర్‌-శ్రీరాంపూర్‌ ప్రెస్‌క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మందమర్రిలోని శ్రీబాలాజీ గ్రామర్‌ హైస్కూల్‌లో 1999-2000 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు మంచిర్యాలలోని నార్త్‌ ఇన్‌ కన్వెన్షన్‌లో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

బీఆర్‌ఎస్‌ ఆవిర్భావ వేడుకలు



మంచిర్యాలటౌన్‌: బీఆర్‌ఎస్‌ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్‌/బెల్లంపల్లి/భీమిని/చెన్నూర్‌రూరల్‌/కాసిపేట/కోటపల్లి/జన్నారం/తాండూర్‌/మందమర్రిరూరల్‌/దండేపల్లి/భీమారం/శ్రీరాంపూర్‌/మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): జిల్లాలో బీఆర్‌ఎస్‌ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించుకునేందుకు 25 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన బీఆర్‌ఎస్‌ అలుపెరగని పోరాటాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్‌ రజతోత్సవ సభకు మంచిర్యాల నియోజకవర్గం నుంచి 3 వేలకు పైగా నాయకులు, వివిధ వాహనాల ద్వారా వెళ్లగా, వాటిని జెండా ఊపి మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, మాజీ ప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు. మండలాలు, గ్రామాల నుంచి నేతలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. బెల్లంపల్లి నుంచి శ్రేణులు వెళ్లగా అంతకుముందు టీబీజీకేఎస్‌ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపాలిటీలో వార్డుల వారీగా బీఆర్‌ఎస్‌ పతాకాలను నాయకులు ఎగురవేశారు. జన్నారం మండలంలో బీఆర్‌ఎస్‌ జెండాలను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌ నాయక్‌ ఆధ్వర్యంలో వాహనాల్లో నాయకులు వెళ్లారు. శ్రీరాంపూర్‌ నుంచి టీబీజీకేఎస్‌ నేతలు, కార్యకర్తలు వెళ్లారు. యూనియన్‌ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌ జీఎం కార్యాలయం సమీపంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులు, కార్లలో ప్రత్యేక కాన్వాయ్‌ ద్వారా సభకు హాజరయ్యారు. యూనియన్‌ కేంద్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌, కేంద్ర కమిటీ నాయకులు వెళ్లారు.



శ్రీరాంపూర్‌: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దండేపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌



మందమర్రిరూరల్‌: సభకు తరలివెళ్తున్న నాయకులు



జన్నారం: సభా ప్రాంగణం వద్ద..



బెల్లంపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



హాజీపూర్‌లో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు



ముత్యంపల్లిలో..

రెండు సీసీ కెమెరాల చోరీ

మంచిర్యాలక్రైం: హాజీపూర్‌ మండలం టీకానపల్లి ఫారెస్ట్‌ బీట్‌ పరిధిలోని నగరం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలు చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బీట్‌ ఆఫీసర్‌ ఫరీదాబేగాం ఆదివారం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.

పరామర్శ

జైపూర్‌: మండలంలోని శివ్వారం గ్రామ తాజా మాజీ సర్పంచ్‌ ఆవిడపు గణేశ్‌ తల్లి లస్మమ్మ ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ఆదివారం చెన్నూర్‌ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు. లస్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఫయాజ్‌, బీసీ సంఘం నాయకులు మారుతి, మల్లేశ్‌, సమ్మయ్య ఉన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): రెడ్డి సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గడ్డం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గడ్డం కృష్ణారెడ్డి, ఏనుగు వంశీధర్‌రెడ్డి, గుర్రం లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్ర గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఏనుగు భూపతిరెడ్డి, గడ్డం మునీందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా ఏనుగు మహిపాల్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, కోశాధికారిగా బద్దం మల్లారెడ్డి, సలహాదారుగా సింగిరెడ్డి కొండారెడ్డి, పి.అశోక్‌రెడ్డి, అన్నం మధుసూదన్‌రెడ్డి, ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, గుర్రం రాజేశ్వర్‌రెడ్డి, న్యాయ సలహాదారుడిగా ఏనుగు జైపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఏనుగు వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడిగా మండలానికి చెందిన ఏనుగు గంగాధర్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నియామకపత్రం అందజేశారు. సంఘ నాయకులు మనోహర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మండల అధ్యక్షుడికి నియామకపత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

కిష్టంపేటలో 'మన్‌ కీ బాత్‌'

చెన్నూర్‌రూరల్‌: బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కిష్టంపేట గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌ ప్రోగ్రాంను నిర్వహించారు. పీఎం మన్‌ కీ బాత్‌ వీక్షించేలా ప్రజలు టీవీని ఏర్పాటు చేయించారు.

బీరన్న దేవునికి పూజలు



మొక్కలు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్‌

నెన్నెల: గొల్లకుర్మల ఆరాధ్య దైవమైన బీరన్న దేవుడికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గొల్లపల్లిలో నిర్వహించిన బీరన్న కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. కుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. మహిళలు శోభాయాత్రగా బీరన్న బోనాలు సమర్పించారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు గట్టు మల్లేశ్‌, నాయకులు బొమ్మెన హరీశ్‌గౌడ్‌, తోట శ్రీనివాస్‌, కొమ్ము రాజన్న పాల్గొన్నారు.

భీమారం: నర్సింగాపూర్‌లోని బీరన్న దేవుని ఆలయంలో మహిళలు బోనాలు పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజార్లు కల్యాణం నిర్వహించారు.

క్లుప్తంగా

ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్‌

బెల్లంపల్లి: ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓ కార్పొరేట్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆర్థోపెడిక్‌ వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌ శ్రేణులు, కార్పొరేట్‌ వైద్య బృందం పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాల జాతర



బోనమెత్తిన డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక తిలక్‌నగర్‌లో పోచమ్మ ఆలయ అష్టాదశ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం డప్పుచప్పుళ్ల మధ్య పాలపారకతో ఆలయాన్ని అలంకరించారు. డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్లు నల్ల మహేశ్‌, నల్ల శంకర్‌, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ కేంద్రాలు ప్రారంభం



కుమారుడు చరణ్‌రావుతో కలిసి అంబలి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్‌: కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్‌ ట్రస్టు ద్వారా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రతి ఏటా నిర్వహించే సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని, అందులో భాగంగా వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు, అంబలి పంపిణీ కేంద్రాలు ప్రారంభించినట్లు డీసీసీ అధ్యక్షురాలు సురేఖ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌, మార్కెట్‌, ఐబీ చౌరస్తాలో అంబలి పంపిణీ కేంద్రాలను ఆదివారం కుమారుడు చరణ్‌రావుతో కలిసి ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల శిక్షణ తరగతులు



పతాకావిష్కరణ చేస్తున్న విజయలక్ష్మి

బెల్లంపల్లి: బెల్లంపల్లి తాపీకార్మిక సంఘం భవనంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశవర్కర్లకు శిక్షణ తరగతులను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల్లో జాతీయ, అంతర్జాతీయ తాజా పరిస్థితులు, రాష్ట్ర స్థితిగతులు, కార్మికచట్టాల అమలు, కనీస హక్కులు తదితర అంశాల గురించి మాట్లాడారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని సూచించారు. రాష్ట్ర చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కోకన్వీనర్‌ పైళ్ల ఆశయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్‌.రమణ, బెల్లంపల్లి మండల కన్వీనర్‌ చల్లూరి దేవదాస్‌, శ్రేణులు భానుమతి, రాజమణి, సమ్మక్క పాల్గొన్నారు.

వర్షం ఇక్కట్లు



తాళ్లపేటలో బస్తాలు తడవకుండా కవర్లు కప్పిన దృశ్యం

దండేపల్లి: మండలంలో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం కుప్పలు, బస్తాలు తడవకుండా కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇక్కట్లు పడ్డారు. కొందరు టార్పాలిన్‌ కవర్లు కప్పి జాగ్రత్త వహించారు.